క్లుప్తంగా

నిధుల కోసం కేంద్ర సహాయమంత్రికి వినతి



బండి సంజయ్‌కు వివరిస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం ఇచ్చినట్లు బీజేపీ నాయకులు వెంకటేశ్వర్ రావు, ఆనంద్‌రెడ్డి, ప్రతాప్ తెలిపారు. కరీంనగర్‌లో బీజేపీ పార్టీ కార్యాలయంలో కలిసి ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించి నిధులు త్వరగా మంజూరు చేయించాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

సాగుచేసే రైతులకే రైతుబంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న సాగర్‌రావు

మల్యాల: భూమి సాగు చేసే రైతులకే రైతుబంధు ఇవ్వాలని, రెండేళ్లలో కనీసం ఒక్క పంట సాగు చేసిన వారినే అర్హులుగా గుర్తించాలని పోతారం సింగిల్ విండో చైర్మన్ అయిల్నేని సాగర్ రావు అన్నారు. మండలంలోని పోతారం సొసైటీలో ఆదివారం రైతుబంధు ప్రత్యేక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్‌రావు మాట్లాడుతూ 10 ఎకరాల్లోపు సాగు చేసుకునే రైతులకే రైతుబంధు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సహకార అధికారి బి.రాంమోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, అశోక్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గనవేని మల్లేశ్‌కు జాతీయ పురస్కారం



పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

మల్లాపూర్: సామాజిక సేవలతో పాటు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న గనవేని మల్లేశ్(రేగుంట-మల్లాపూర్ మండలం) మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారతరత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి-2024 ఉత్సవాలను పురస్కరించుకుని మహానంది జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు పోలోజ్ రాజ్‌కుమార్, ప్రముఖ సినీ హాస్యనటుడు ఆర్‌ఎస్ నంద చేతుల మీదుగా మల్లేశ్‌కు జాతీయ పురస్కారం అందించారు.

విద్యార్థులకు సన్మానం



టాపర్లను సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్: విద్యార్థులు గమ్యం చేరేవరకు తీవ్రంగా శ్రమించాలని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఓడ్నాల రాజశేఖర్ అన్నారు. ఎస్సెస్సీ ఫలితాల్లో టాపర్లుగా నిలిచి, ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌లు సాధించిన విద్యార్థులు గుజ్జుల లక్ష్మీనర్సయ్య, బొక్కల శరణ్య, సెవ్వ రిశాంత్, పెరిక కృష్ణప్రియలను ఆదివారం మల్లాపూర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో రాణించి ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు ముత్యాల శంకర్, ప్రధాన కార్యదర్శి సరికెల మహిపాల్, పుప్పాల మహేశ్, జిల్లా సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో జగిత్యాల పట్టణానికి చెందిన సరోజిని మల్టీస్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ గొల్లపల్లి రవి,డాక్టర్ నాగెల్లికృష్ణతేజ గ్రామంలో సుమారు 200 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

విస్తరణకు నోచుకోని పల్లె రోడ్లు

- ఇరుకు రోడ్లతో తరుచూ ప్రమాదాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



తాండ్ర్యాలలో ఇరుకు రోడ్డుపై ఎదురెదురుగా బస్సు, కారు (ఫైల్)



కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో ప్రమాదకర మూలమలుపు

కథలాపూర్: రోజురోజుకి జనాభాతోపాటు వాహనాల వినియోగం పెరుగుతోంది. దీనికి తగ్గట్టు పల్లె రోడ్లు విస్తరణకు నోచుకోడం లేదు. దీంతో ఇరుకు రోడ్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల క్రితం వేసిన రోడ్లు ఉన్నాయి. దీంతో సకాలంలో గమ్యం చేరుకోలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్ల విస్తరణ చేపట్టాలని కోరుతున్నారు.

మండలంలో ఇరుకుగా ఉన్న రోడ్లు ఇవే..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. మండలంలోని పలు గ్రామాల రోడ్లు రోడ్ల భవనాలశాఖ పరిధిలో ఉన్నప్పటికీ రోడ్ల విస్తరణ గురించి పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. ఎదురుగా బస్సు, లారీలు, వ్యాన్లు వస్తే మరో వాహనం వెళ్లాలంటే ఇబ్బంది. మండల ప్రజలు కరీంనగర్‌కు చేరుకోవడానికి తక్కువ సమయం పడుతుందని తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల మీదుగా వెళ్తుంటారు. దీంతో ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లో రోడ్లు ఇరుకుగానే ఉన్నాయి. ఎదురుగా వాహనం వస్తే బైకులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. కథలాపూర్-భూషణరావుపేటకు వెళ్లే రూట్‌లో కథలాపూర్‌లో రోడ్డు ఇరుకుగా ఉంది. బైకులపై స్పీడ్‌గా వెళ్తితే ఎదురుగా వచ్చిన వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురైన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లోనూ రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. రోడ్లు ఇరుకుగా ఉండటంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల విస్తరణ చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏళ్ల నాటి రోడ్లతో ఇబ్బంది



గ్రామాల్లో ఏళ్లక్రితం వేసిన రోడ్లున్నాయి. జనాభా పెరిగి వాహనాల వినియోగం పెరిగిందని అధికారులకు తెలుసు. మండలంలో చాలా వరకు రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో సకాలంలో గమ్యాలకు చేరుకోలేకపోతున్నాం. ఇరుకు రోడ్లతో సాయంత్రం వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ చేపట్టి కొత్త హంగులతో రోడ్లు నిర్మించాలి.

– ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, భూషణరావుపేట.

పాలకులు దృష్టిసారించాలి



ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లను ఏర్పాటు చేయాలి. దీనిపై పాలకులు దృష్టి సారించాలి. నలభై ఏళ్ల క్రితం ఊళ్లకు ఎప్పుడో ఒకసారి బస్సు వచ్చేది. అప్పుడు ఏర్పాటు చేసిన రోడ్లతో నెట్టుకురావడం దారుణం. ఇప్పుడు ఊళ్లలో వాహనాలను వినియోగించేవారి సంఖ్య పెరిగింది. దని ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియదా? గ్రామాల్లో డబుల్ రోడ్లు ఏర్పాటు చేయాలి.

– మామిడిపెల్లి గంగాధర్, తాండ్ర్యాల

ప్రతిపాదనలు పంపించాం



రోడ్ల భవనాలశాఖ పరిధిలోని రోడ్ల సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. మండలంలోని పలు గ్రామాల రోడ్ల విస్తరణ గురించి ఇటీవల ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే ఆయా గ్రామాల్లో డబుల్ రోడ్ల పనులు చేయిస్తాం.

– మధు, ఆర్‌అండ్‌బీ, ఏఈ, కోరుట్ల డివిజన్



రోడ్డుకు పక్కనే ఉన్న బావి



రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభం

ఆదమరిస్తే అంతే..

మేడిపల్లి: మేడిపల్లి-కొండాపూర్ రహదారిలో రోడ్డుకు ఆనుకుని ఉన్న వ్యవసాయ బావులతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇదివరకు మేడిపల్లి-కొండాపూర్ రోడ్డు సింగిల్ లైన్‌గా ఉండేది. వాహనాల వేగం తక్కువగా ఉండటంతో చాలా సార్లు ప్రమాదాలు తప్పాయి. ఇప్పుడు డబుల్ రోడ్డు కావడంతో వాహన దారులు పరిమితికి మించి వేగంగా వెళ్తున్నారు. రెండు వ్యవసాయ బావులు మూలమలుపుల వద్ద ఉండటంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. శనివారం ప్రమాదవశాత్తు ఓ ద్విచక్రదారుడు అందులో పడే ప్రమాదం తప్పింది. వీలైనంత తొందరలో ఆ బావులను పూడ్చివేయలని వాహనదారులు కోరుతున్నారు. మేడిపల్లి నుంచి డబుల్ రోడ్డు దేశాయిపేట దుర్గమ్మ గుడి వరకు పూర్తయ్యింది. రోడ్డుకు అతి సమీపంలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.

పాఠశాలలపై చర్యలు చేపట్టాలని ధర్నా



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో ఓ పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని, దీనిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు అమ్ముతూ పాఠశాల విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లా విద్యాశాఖాధికారిని విధుల నుండి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనువాడ నందు, జిల్లా హాస్టల్స్ ఇన్‌చార్జి శ్రీను, జోనల్ ఇన్‌చార్జి ప్రశాంత్, కార్యకర్తలు విఘ్నేష్ రెడ్డి, దినేష్, విష్ణు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందాలి

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ సామాజిక, సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలను పొందాలని లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ మోర భద్రేశం అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ 9వ ఇన్‌స్టాలేషన్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా లయన్స్‌క్లబ్‌లోకి వచ్చే సభ్యులు మంచిసేవలు చేపట్టి ప్రజల గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రిజియన్ చైర్మన్లు శివ శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, రిజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, జోనల్ చైర్మన్ గడ్డం శంకర్‌రెడ్డి, చార్టెడ్ ప్రెసిడెంట్ దేవ మల్లయ్య, ఫాస్ట్ అధ్యక్షుడు కనుక సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

కథలాపూర్: మండలకేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఉదయం 4 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లో చదువుతున్నారని, ఉదయం 4 గంటలకు బస్సు సౌకర్యం ఉంటే కళాశాల ప్రారంభం సమయానికి చేరుకునే వీలుంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని రామస్వామి, అంజిరెడ్డి, భాస్కర్ తదితరులు కోరారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జూన్ 28 నుంచి 30 వరకు గోవాలో ఏకలవ్య స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్ -14 క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలో తెలంగాణ రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలిపారు. ఈ పోటీల్లో గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలు పాల్గొనగా, తెలంగాణ టీంలో జ్యోతి హైస్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొనడం విశేషం . ఈ సందర్భంగా డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్ రావు తదితరులు అభినందించారు.

విశ్వగురుగా భారత్

రాయికల్: భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపడమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయమని రాష్ట్రీయ స్వయం సేవక్ జిల్లా సంచాలక్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇటిక్యాలలో గురుపూజోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. హిందూ సంస్కృతిలో గురువుకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఐకమత్యంగా ఉంటూ దేశ సమైక్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఖండ కార్యవహ వేల్పుల స్వామియాదవ్, పందిరి లక్ష్మీనర్సయ్య, దొంగ జితేందర్‌రెడ్డి, లింబాద్రిగౌడ్, సత్యం గౌడ్, రాజరెడ్డి, లవకుమార్, శ్రీనివాస్ శేఖర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం విద్యుత్‌షాక్ తగిలి రెండు గొర్రెలు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన దయ్యాల మహేశ్ అనే గొర్రెల కాపరీ తన గొర్రెలను మేపేందుకు గ్రామశివారులోకి తీసుకెళ్లారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైర్లు రెండు గొర్రెలకు తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 వేలు నష్టపోయినట్లు బాధితుడు మహేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడి రక్తదానం

మేడిపల్లి: భీమారం మండలంలోని ఒడ్యాడ్ గ్రామానికి చెందిన గర్భిణికి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా, భీమారం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చిలివేరి వెంకటేశ్ జగిత్యాల వెళ్లి రక్తదానం చేసి నిండు ప్రాణాన్ని కాపాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌కు గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భీమారంలో క్రికెట్ అభిమానుల సంబరాలు

మేడిపల్లి: పదిహేడేళ్ల తర్వాత ఇండియా క్రికెట్ టీం టీ20 కప్ గెలవడంతో భీమారం మండల వ్యాప్తంగా యువత సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం భీమారం మండల కేంద్రంలో యువకులు త్రివర్ణ జెండాలతో గ్రామంలో ర్యాలీ తీసి, బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు.

అనాథ బాలిక ఉచిత విద్యకు దాతల చేయూత

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామానికి చెందిన సల్లం మోక్షిత అనే అనాథ బాలికకుతల్లిదండ్రులు లేకపోవడంతో వారి పెద్దమ్మ సల్లం రాజేశ్వరి ఇంట్లో ఉంటుంది. రాజేశ్వరి బీడీలు చుడుతూ ఈ బాలికను పోషిస్తోంది. తాండ్ర్యాలలోని వినయ్ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ రఘుపతిరావు మోక్షిత ఐదో తరగతి వరకు తన పాఠశాలలో ఉచిత విద్య, బస్సు సౌకర్యం ఉచితంగా కల్పిస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ బాలిక మోక్షితకు పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాం, ఇతర సామగ్రిని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రఘుపతిరావు, రమేశ్‌గౌడ్‌ను గ్రామస్తులు అభినందించారు.

మందుల పంపిణీ

జగిత్యాల: ప్రభుత్వ వైద్యశాలలో హేమోఫిలాయాతో బాధపడుతున్న రోగులకు ఆదివారం పెద్దపల్లి హేమోఫిలియా సొసైటీ ఇంటాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. రూ.6 లక్షలు విలువ చేసే ఫ్యాక్టర్ ఇంజక్షన్ మందును ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సైఫ్, పెద్దపల్లి చాప్టర్ సభ్యులు వాసుదేవ్, శ్రీనివాస్, మురళీకృష్ణ, హరీశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం



వెంకటేశం

కోరుట్లటౌన్: కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాకల వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా ద్యావనపెల్లి గోపి కుమార్, ప్రధాన కారదర్శిగా ఎనుగందుల రమేశ్, కోశాధికారిగా అనుమల్ల నాగయ్య, ఉప కోశాధికారిగా బండ్ల సతీశ్, సహాయ కార్యదర్శిగా బండ్ల లక్ష్మీనారాయణ, సలహాదారులుగా సిరిపురం గంగారాం, మ్యాకల నర్సయ్య, సంకు నరేందర్, రుద్ర వెంకట్రాములు, అనుమల్ల రాజేశం, సభ్యులుగా శివప్రసాద్, కిషన్, లక్ష్మణ్, రమేశ్, రాజేశ్, కైలాశ్, నరేశ్‌లు ఎన్నికయ్యారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

మెట్‌పల్లి: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్సారెస్పీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఇల్లెందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండా రాకేశ్, కోశాధికారిగా నాంపల్లి వేణుగోపాల్, జోన్ చైర్మన్‌గా గడ్డం శంకర్ రెడ్డి ప్రమాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ సెకండ్ వైస్ గవర్నర్ బద్రేశంతో పాటు చెర్లపల్లి రాజేశ్వర్, వెల్ముల శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది



మదుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెగడపల్లి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెగడపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పని చేసిన గోలి మదుసూధన్‌రెడ్డి ఉద్యోగవిరమణ పొందిన సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా మధుసూధన్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పూర్వ ఎంఈవోలు అంజిరెడ్డి, మధుసూదన్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు, రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సారంగాపూర్: జగిత్యాల ప్రాంతంలోని ఉపాధ్యాయులు 2008లో ఏర్పాటు చేసుకున్న టీసీఎల్ (టీచర్స్ క్రికెట్ లీగ్)లోని సభ్యులు ఇటీవల పదొన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ రథశాల వద్ద సన్మానించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్స్ క్రికెట్ లీగ్ జగిత్యాల చైర్మన్ బోగ రమేష్, మేనేజర్ బోయిని సురేశ్ పాటు, పదొన్నతి పొందిన ఉపాధ్యాయులు, టీసీఎల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

మల్యాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన నాలుగో తరగతి ఉద్యోగి దర్వేశ్ మహమ్మద్‌కు తెలంగాణ రాష్ట్ర నాలుగో తరగతి సంఘం ఉపాధ్యక్షుడు మోజాయిద్ ఖాన్, జిల్లా అధ్యక్షులు బొమ్మకంటి చంద్రయ్య శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఆర్‌ఐ తిరుపతి, జిల్లా కార్యదర్శి వేణు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కు తెలుగు వెలుగు సాహితీ పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఈదుల లక్ష్మణ్

రాయికల్: మాజీ ప్రధాని పీవీ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ ఆధ్వర్యంలో గ్రామీణ వైద్య సేవారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన ఈదుల లక్ష్మణ్‌కు ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖుల చేతులు మీదుగా జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

శ్రీభక్త మార్కండేయ నాటక కళా మండలికి పురస్కారాలు



పురస్కారాలతో కళా మండలి సభ్యులు

మల్యాల: మండలంలోని శ్రీ భక్త మార్కండేయ నాటక కళ మండలిలో 12మంది తెలుగు వెలుగు సాహితీ వేదిక పురస్కారాలు అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీ భక్త మార్కండేయ నాటక కళ మండలి సభ్యులు బండారి అశోక్, తండ్రి కొడుకులు రాగుల రవీందర్, రాగుల సురేశ్, కుసుమ గణేశ్, పన్నాటి సంతోష్, బోగ పురుషోత్తం, కొక్కుల సుధాకర్, బొడ్డుల మహేందర్, దాసరి గంగారాం, గుమ్మడి మల్లేశం, బాలె శ్రీనివాస్, గుర్రం మన్విని పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలను పలువురు అభినందించారు.

యువకుడికి సన్మానం

మెట్‌పల్లిరూరల్: ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన పాటుకూరి సాగర్ అనే యువకుడిని సేవాభారతి సభ్యులు ఆదివారం సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. తమ గ్రామం నుంచి ఆర్మీ ఉద్యోగం సాధించడం హర్షనీయమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాజమల్లయ్య, జయకృష్ణ, దినేశ్, రామస్వామి, ధర్మరాజ్, వివేక్, వినోద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



రాయికల్ జెడ్పీహెచ్‌ఎస్ 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలిసి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 30 ఏళ్ల ల క్రితం పాఠశాలలో చేసిన అల్లర్లు గుర్తుచేసుకున్నారు. విద్యాబోధన నేర్పిన గురువులు నాగభుషణం.ఆనందరావు,బచ్చిరెడ్డి,నరేందర్‌రెడ్డి, శ్రీనివాసచారి, విద్యాసాగర్, జనార్దన్, రాఘవులు, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గోన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం వెల్లుల్లలోని ఓఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బాల్యపు మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.



మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

నిధుల మంజూరుకు వినతి



విప్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: రోడ్డు నిర్మాణం కోసం రూ. 25 లక్షల నిధులు మంజూరుకు కృషి చేస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. మండలంలోని నేరెళ్ల సాంబశివ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రభుత్వ విప్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసారపు బాలాగౌడ్, పురంశెట్టి మల్లేశం, ధర్మపురి పీఏసీఎస్ వైస్ చైర్మన్ శేర్ల రాజేశం, నాయకులు పాల్గొన్నారు.